# ఎన్నికల్లో నకిలీ నోట్ల కలకలం

- ముఠా గుట్టు రట్టు చేసిన ఎస్ఓటీ పోలీసులు
- ఇద్దరిని అరెస్టు చేసి, నకిలీ నోట్లు సహా 7లక్షల సొత్తు సీజ్

నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు..

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ)/శంషాబాద్ రూరల్: నకిలీ నోట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టును సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2.9 లక్షల నకిలీ నోట్ల(రూ.100, 500)తో పాటు మొత్తం రూ.7లక్షల విలువజేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణగౌడ్ కథనం ప్రకారం.. ఏపీలోని నర్సారావుపేట జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు ఉపాధి కోసం కొన్నిరోజుల కిందట నగరానికి వలసొచ్చాడు. సాగర్ రింగ్‌రోడ్‌లోని అలేఖ్య టవర్స్ వద్ద నివాసముంటూ, సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు అలవాటుపడిన వెంకటేశ్వర్లు ఎలాగైనా సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశాడు. ఏకంగా నకిలీ నోట్లనే తయారు చేసి చలామణి చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. తన అనుచరుడైన ఏపీకి చెందిన శ్రీనివాస్‌తో కలిసి శంషాబాద్‌లోని బాలయేసు కాలనీలో ఒక అద్దె ఇంటిలో నకిలీ నోట్లను తయారు చేయడం మొదలుపెట్టాడు. తయారు చేసిన నకిలీ నోట్లను 1.3 నిష్పత్తిలో ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్, టెలీగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా నకిలీ కరెన్సీ చలామణి ఏజెంట్లను సంప్రదిస్తున్నారు. నకిలీ నోట్లను ఈ ఏజెంట్లు రాత్రి సమయంలో రద్దీగా ఉండే మార్కెట్లు, వీధి వ్యాపార కేంద్రాలు, పండ్ల మార్కెట్లు, కిరాణా దుకాణాలు, రైతు బజార్‌లలో అసలైన నోట్ల మధ్య పెట్టి చలామణి చేస్తూ అమాయక ప్రజలను మోసగిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ఈ ముఠా పెద్ద ఎత్తున నకిలీ నోట్లను చలామణి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, శంషాబాద్ డీసీపీ కె.నారాయణరెడ్డి, ఎస్ఓటీ డీసీపీ ఎంఎ.రషీ పర్యవేక్షణలో శంషాబాద్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ గౌడ్ తన బృందంతో కలిసి నకిలీ నోట్ల తయారీ కేంద్రంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇద్దరు నిందితులతో పాటు రూ.2.9లక్షల నకిలీ కరెన్సీ(రూ.100, 500నోట్లు) సహా మొత్తం రూ.7లక్షల విలువజేసే ప్రింటర్లు, నకిలీ కరెన్సీ తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఆర్‌జీఐ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా నకిలీ నోట్ల ముఠా గుట్టును రట్టు చేసిన శంషాబాద్ ఎస్ఓటీ, ఆర్‌జీఐ పోలీసులను పోలీసు కమిషనర్ అభినందించారు.

## 15 రోజుల్లో.. 90 మంది పోకిరీల అరెస్టు

### కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యం

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): పదిహేను రోజుల్లో 90 మంది ఆకతాయిలను పట్టుకున్నట్లు రాచకొండ మహిళా భద్రతా డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లతో పాటు విద్యా సంస్థలు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాలలో పోకిరీలను సాక్ష్యాధారాలతో పట్టుకుంటున్నామని తెలిపారు. పట్టుబడ్డ వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పట్టుబడ్డ 90 మంది ఈవ్ టీజర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కౌన్సెలింగ్ నిర్వహించారని తెలిపారు. ప్రేమ పేరుతో వేధించడం, ఆటోలో వెళ్తున్న ప్రయాణికురాలిని వేధించడం వంటి ఘటనలతో పాటు డెకాయి ఆపరేషన్లు నిర్వహించి పలువురిని అరెస్టు చేశామని డీసీపీ వెల్లడించారు. వేధింపులకు గురయ్యే మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**కన్న తండ్రే కాలయముడై..**

ఇంటర్ చదువుతున్న బాధితురాలి కాలేజీలో రాచకొండ షీ టీమ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితురాలు తనపై కన్న తండ్రి చేస్తున్న అఘాయిత్యాన్ని వెల్లడించింది. 11 ఏండ్లు ఉన్నప్పటి నుంచి తండ్రి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుడిని జైలుకు పంపించారు.

**క్విక్ లైవ్ యాప్**

వనస్థలిపురంలో నివాసముండే బాధితురాలికి క్విక్ లైవ్ యాప్‌లో ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. మెసేజ్‌లు పంపి, ఫొటోలు తీసుకున్నాడు. ప్రేమ పేరుతో వేధించడం ప్రారంభించాడు. బాధితురాలు షీ టీమ్స్‌ను ఆశ్రయించడంతో వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, నాచారంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినికి స్నాప్‌చాట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపించాడు. బాధితురాలు స్పందించడంతో 'నిన్ను నేను ప్రేమిస్తున్నాను'.. అంటూ వేధించడం ప్రారంభించాడు. దీంతో ఆమె స్పందించడం మానేయడంతో ఫొటో మార్ఫింగ్ చేసి, అతడు బ్లాక్‌మెయిల్ చేయడంతో నాచారం పోలీసులకు ఫిర్యాదుచేయగా.. కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మేడ్చల్, నవంబర్ 8 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఒకరు హోంగార్డు కాగా, మరొకరు గుర్తు తెలియని వ్యక్తి. పోలీసుల కథనం ప్రకారం.. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో నివాసం ఉండే మారుతి(40) మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధులు ముగించుకొని, మేడ్చల్-మజీద్‌పూర్ దారిలో రాత్రి 11 గంటల సమయంలో మూడుచింతలపల్లికి వెళ్తుండగా.. రావల్‌కోల్ కమాన్ వద్ద టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారుతి రెండుకాళ్లు విరిగిపోవడంతోపాటు శరీరమంతా గాయాలయ్యాయి. అతడిని సుచిత్రలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మెదక్ జిల్లా వెంకటాయపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ లంబ శ్రీశైలంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ నర్సింహ రెడ్డి తెలిపారు.

### రింగురోడ్డుపై ...

మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రింగురోడ్డుపై మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి(47)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ నర్సింహ రెడ్డి తెలిపారు.

## భార్యను హత్య చేసి..

### ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు

### అరెస్టు చేసిన ఐఎస్ సదన్ పోలీసులు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): భార్య గొంతు కోసి.. తాను ఆత్మహత్యాయత్నానికి యత్నించిన యువకుడిని ఐఎస్ సదన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ రోహిత్‌రాజ్ కథనం ప్రకారం.. మహేశ్వరం మండలం నాగులధోని తాండకు చెందిన కత్రావత్ ప్రేమ్‌కుమార్ అలియాస్ చిన్న, స్వప్న దంపతులు. చంపాపేటలోని ఎస్‌జీఆర్ కాలనీలో నివాసమున్నారు. స్వప్న తరచూ తన స్నేహితుడైన సురేశ్‌తో మాట్లాడటంతో భర్త ప్రేమ్‌కుమార్ పలుమార్లు హెచ్చరించాడు. అయినా.. ఆమె తన ప్రవర్తనను మార్చుకోలేదు. గత నెల 28న స్వప్న స్నేహితుడైన సురేశ్‌తో తన ఇంట్లో మాట్లాడుతుండగా ప్రేమ్ చూశాడు. అప్పటికే తాను డీమార్టు నుంచి తెచ్చుకున్న కత్తితో స్వప్నను బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్లి గొంతుకోసి హత్య చేశాడు. తాను కూడా బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో సురేశ్‌ను ఇటీవలే పోలీసులు అరెస్టు చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, కోమాలోకి వెళ్లిన ప్రేమ్ దవాఖానలో కోలుకున్నాడు. అతడి ఆరోగ్యం కుదుటపడటంతో భార్యను హత్య చేసిన కేసులో ప్రేమ్‌ను కూడా బుధవారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచినట్టు డీసీపీ వెల్లడించారు.

## వాహనం ఢీకొని ..

జగద్గిరిగుట్ట, నవంబర్ 8: వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దేవేందర్‌నగర్ గాలిపోచమ్మ బస్తీలో నివాసముండే దుర్గయ్య (45)ను బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి, వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన అతడు ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలను సేకరిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నెక్లెస్ రోడ్డులో జంటలకు బెదిరింపు

### నకిలీ పోలీసు అరెస్టు.. నిందితుడిపై 18 కేసులు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): పోలీస్ అని చెప్పుకుంటూ.. అమాయకులను మోసం చేస్తున్న ఒక నకిలీ పోలీసును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ నిఖితా పంత్ కథనం ప్రకారం.. జనగాం జిల్లాకు చెందిన సృజన్ కుమార్‌పై రెండు తెలుగు రాష్ట్రాలలో 18 కేసులు ఉన్నాయి. రెండు నాన్ బెయిలబుల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. సృజన్ కుమార్ భార్య ఎస్సైగా పనిచేసింది. ఆమె మృతి చెందిన తరువాత.. ఆమె పోలీస్ డ్రెస్ ఫొటోలు, గన్ ఫొటోను ఫోన్‌లో సేవ్ చేసి పెట్టాడు. నంబర్ ప్లేట్ లేని పల్సర్ వాహనంపై పోలీస్ అని రాసి తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే నెక్లెస్ రోడ్డులో తిరుగుతూ ఒంటరిగా ఉండే జంటలను టార్గెట్ చేశాడు. టార్చ్‌లైట్ వేసి.. మీరు ఇక్కడ ఏం చేస్తున్నారంటూ బెదిరిస్తూ.. తాను పోలీసునంటూ దబాయించి.. వారిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడు. అనంతరం ఈ విషయం పోలీస్‌స్టేషన్‌లో చెబితే మీ అంతుచూస్తానంటూ హెచ్చరించాడు. ఈ విధంగా.. గత నెల 9వ తేదీన నెక్లెస్ రోడ్డు బతుకమ్మ ఘాట్ వద్ద కారులో ఉన్న ఓ జంటను బెదిరించాడు. వారి వద్ద నుంచి రూ. 5 లక్షలు వసూలు చేశాడు. దీనిపై బాధితులు సెక్రటరియెట్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. కేసు దర్యాప్తు చేపట్టిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి రూ. 1.38 లక్షల నగదు, బైక్ తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

## బాలానగర్‌లో రూ.52 లక్షలు పట్టివేత

బాలానగర్, నవంబర్ 8 : బాలానగర్, ఎస్ఓటీ పోలీసులు కలిసి చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ. 52.50 లక్షలు పట్టుబడ్డాయి. ఇన్‌స్పెక్టర్ కె. భాస్కర్ కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఎస్ఓటీ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టామని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నాగేందర్ వద్ద నుంచి రూ. 52.50 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## సోషల్ మీడియాలో డ్రగ్స్ వీడియో

### సీరియస్‌గా తీసుకున్న పోలీసులు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ తీసుకుంటూ వీడియో తీసి, దానిని గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్టు చేసి వైరల్ చేశారు. దీనిపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదయ్యింది. ఈ ఘటనపై సైబర్‌క్రైమ్ పోలీసులతో పాటు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీ నాబ్) కూడా దర్యాప్తు చేస్తుంది. డ్రగ్స్ వాడకంతో పాటు వాటిని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై టీనాబ్ సీరియస్‌గా ఉంది. ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు.

## నగరంలో పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): నగరంలో 14 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ బుధవారం పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఉత్తర్వులు జారీ చేశారు.

| ఇన్‌స్పెక్టర్ పేరు | ప్రస్తుత పీఎస్ | బదిలీ పీఎస్ |
|---|---|---|
| ఎరుకొండ నీతయ్య | డీఐ, చాదర్‌ఘట్ | ఎస్‌హెచ్‌ఓ, చిక్కడపల్లి |
| గంట సంజీవ్ | డీఐ, తిరుమలగిరి | డీఐ, చాదర్‌ఘాట్ |
| ఎస్.విజయ్ | డీఐ, కమాటిపురా | ఎస్‌హెచ్‌ఓ, బోరబండ |
| కె.రవికుమార్ | ఎస్‌హెచ్‌ఓ, బోరబండ | సీసీఎస్, డీడీ |
| పి. లక్ష్మీకాంత్‌రెడ్డి | డీఐ, అఫ్జల్‌గంజ్ | ఎస్‌హెచ్‌ఓ, సైఫాబాద్ |
| ఎస్. రాజశేఖర్ | ఎస్‌హెచ్‌ఓ, సైఫాబాద్ | ఎస్సీ, సిటీ |
| గడ్డిపాటి నరేశ్‌కుమార్ | ఎస్సీ, సౌత్ ఈస్ట్/జోన్ | ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ |
| టి.శ్రీనాథ్‌రెడ్డి | ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ | ఎస్సీ, సౌత్ ఈస్ట్‌జోన్ |
| శ్రీరామ్ సైదబాబు | టాస్క్‌ఫోర్స్, అడ్మిన్ | సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ |
| చిట్టి బుర్ర | సౌత్ ఈస్ట్/జోన్ టాస్క్‌ఫోర్స్ | టాస్క్‌ఫోర్స్, అడ్మిన్ |
| ఎల్.భాస్కర్‌రెడ్డి | సైబర్‌క్రైమ్స్ | నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ |
| కొన్ని సైదులు | నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ | సైబర్‌క్రైమ్స్ |
| మధుసూదన్ బాడే | ట్రాఫిక్ అడ్మిన్, | సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ |
| యారగాని అజయ్‌కుమార్ | సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ | ట్రాఫిక్ అడ్మిన్ |

చిలకలగూడ, మధురానగర్, సంతోష్‌నగర్ ఠాణాల పరిధిలోని పలు ప్రాంతాలలో బుధవారం నగర పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

– సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ)